రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభం

(6లో)

సిఐటియు జిల్లా నూతన కమిటీ సభ్యులు

నూతనోత్తేజం

- చర్చల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతినిధులు
- భవిష్యత్ పోరాటాలకు దిశా నిర్దేశం చేసిన అతిథులు
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లింపులతో పాటు పలు తీర్మానాలు
- ముగిసిన సిఐటియు 11వ మహాసభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సిఐటియు జిల్లా 11వ మహాసభ విజయవంతమైంది. శ్రీకాకుళం నగరంలో రెండు రోజుల పాటు జరిగిన మహాసభ ఆదివారం సాయంత్రంతో ముగిసాయి. రెండో రోజు జరిగిన ప్రతినిధులసభ జిల్లాలో వివిధ రంగాల కార్మికులు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ప్రవేశ పెట్టిన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. మహాసభ కార్మికవర్గంలో నూతనోత్తేజాన్ని నింపింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ నర్సింగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ భవిష్యత్ పోరాటాలపై కార్యోన్ముఖులను చేశారు. సిఐటియు బలోపేతానికి దిశా నిర్దేశం చేశారు.

శ్రీకాకుళం నగరంలోని పెద్దకోట పోలినాయుడు నగర్‌లో రెండో రోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. తొలుత సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి సిఐటియు జెండాను

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న ఆదినారాయణమూర్తి

ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రతినిధుల సభలో జిల్లా నలుమూలల నుంచి వివిధ రంగాలకు నాయకత్వం వహించిన చురుకైన కార్యకర్తలు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రవేశ పెట్టిన నివేదికపై చర్చించి ఆమోదం తెలిపారు. మూడేళ్ల కాలంలో చేపట్టిన పోరాటాలు, కార్యక్రమాలను సమీక్షించారు. ఉద్యమ అనుభవాలను, సాధించిన విజయాలను పంచుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కర్తవ్యాలను మహాసభలో రూపొందించుకున్నారు

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా సిహెచ్ అమ్మన్నాయుడు
- ప్రధాన కార్యదర్శిగా పి.తేజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నిక

మహాసభ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 20 మంది ఆఫీస్ బేరర్లుగా, 49 మంది జిల్లా కమిటీ సభ్యులుగా మొత్తం 69 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సిహెచ్ అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.తేజేశ్వరరావును ఎన్నుకున్నారు. కోశాధికారిగా అల్లు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.నాగమణి, కె.సూరయ్య, డి.గోవిందరావు, ఎ.మహాలక్ష్మి, ఎం.ఆదినారాయణమూర్తి, జి.అమరావతి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎస్.లక్ష్మీనారాయణ, బి.మురళీ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, డి.సుదర్శనం, కె.గురునాయుడు, ఎన్.వి. రమణ, బి.ఉత్తరతో పాటు మరో ముగ్గురు సభ్యులను కో-ఆప్ట్ చేయనున్నారు.

విరామ సమయంలో గీతాలు ఆలాపన

ప్రతినిధుల సభ ప్రారంభం, జెండా ఆవిష్కరణ సమయంలో ప్రజా కళాకారులు చైతన్యం స్ఫురించే గీతాలను ఆలపించారు. పలువురు చిన్నారులు పాటలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు

తీర్మానాలివే..

మహాసభలో ఏడు తీర్మానాలు చేసి వాటికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు • కనీస వేతనం రూ.26 వేలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేయాలి. • కొవ్వాడ అణు పార్కును రద్దు చేయాలి. •జిల్లాలో అధునాతన వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి. ఇఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత లేకుండా చూడాలి. •మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు అరికట్టాలి, భద్రత కల్పించాలి. •స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలి. కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయం కల్పించాలి. • భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి. • జీడి కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలుకు చర్యలు చేపట్టాలి.

జిల్లా వెనుకబాటుకు పాలకులదే బాధ్యత

- వనరులున్నా అభివృద్ధిని విస్మరించారు
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు
- కక్ష సాధింపులకు పాల్పడుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

పుష్కలమైన వనరులున్నా జిల్లా వెనుబడిపోవడానికి పాలకులే బాధ్యత వహించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా 11వ మహాసభకు వచ్చిన ఆయన స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్‌తో కలిసి మాట్లాడారు. ఉద్దానంతో పాటు హిరమండలం, కొత్తూరు ప్రాంతంలో ఉన్న జీడిసాగు అభివృద్ధికి విత్తనాలు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఆ తర్వాత పంటను తామే కొంటామని కేరళ ప్రభుత్వం ప్రతిపాదించినా రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపలేదని చెప్పారు. జిల్లాలో జ్యూట్ పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మూడు నెలల కాలంలో రియల్ ఎస్టేట్ కోసం ఆరు చక్కెర పరిశ్రమలను మూసేశారని చెప్పారు. ప్రతి ఫ్యాక్టరీలో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పిస్తామని చట్టం తెచ్చినా ఎక్కడా ఉపాధి చూపించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకుంటున్నారని చెప్పారు. అరబిందోలో బెంగాల్ కార్మికులను నియమించారని చెప్పారు. కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను కట్టుబానిసలుగా పని చేయించాలని చూస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా కోటి మంది స్కీం వర్కర్లకు గ్రాట్యూటీ అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా అమలు చేయకుండా దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించే వరకు పోరాడుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా ఉండటం వల్లే శ్రమదోపిడీ జరుగుతోందని చెప్పారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో అరబిందో యజమాన్యానికి కొమ్ములు వచ్చాయని చెప్పారు. కార్మికులను పనిలో నుంచి తొలగించడంతో పాటు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో వయోపరిమితి దాటిపోయిందనే పేరుతో కార్మికులను ఇంటికి పంపేస్తోందని చెప్పారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన సంబంధితశాఖ నిద్ర పోతోందని, ప్రభుత్వ యంత్రాంగం యజమానులకు తొత్తుగా మారిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం జిల్లాలో ఉన్న పరిశ్రమలను ప్రోత్సాహించకుండా బినామీ పేర్లతో వేరే రాష్ట్రాల్లో ఉన్న సొంత కంపెనీల నుంచి సరుకు తెచ్చుకుంటోందని చెప్పారు.

మాట్లాడుతున్న నర్సింగరావు

యునైటెడ్ బ్రెవరీజస్ కంపెనీలో ప్రభుత్వం నుంచి మద్యం ఆర్డర్లు తగ్గాయనే పేరుతో కార్మికులకు 15రోజులకు మించి పని ఇవ్వడం లేదని చెప్పారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, ఆర్.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

బదిలీల ప్రస్తావన లేకుండా పని సర్దుబాటు పేరుతో ఉద్యోగోన్నతులపై దాటవేత ధోరణిని నిరసిస్తూ సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులను దూర ప్రాంతాల పాఠశాలలకు మార్చడం తగదన్నారు. అర్హతలు లేని సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు డెప్యూటేషన్ వేస్తున్నారని, హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్స్ అవసరం అంటూ ప్రమోషన్లు పొందిన వారు అదనంగా ఉన్నారనే నెపంతో డెప్యుటేషన్స్ వేస్తున్నారన్నారు. ప్రమోషన్ పొందిన వారికి తాత్కాలికంగా ప్లేస్మెంట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన హామీలో భాగంగా ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో భాగమైన వివిధ రకాల యాప్‌ల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఈనెల 18న సిపిఎస్ రద్దు డిమాండ్‌తో 5కె వాక్ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు ఎల్,బాబురావు, జిల్లా కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, కే.దాలయ్య, ఎం.వెంకటరమణ, హెచ్.అన్నాజీరావు, జి.మాధవరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, జి.సురేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల నియామకాల్లో

వయో పరిమితి పెంచాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి

కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు చాలా మందికి వయస్సు మీరిపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం తన తప్పిదంగా భావించి మూడేళ్ల వయో పరిమితిని సడలించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2.40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, తాను అధికారంలోకి వస్తే భర్తీ చేస్తామన్న జగన్మోహన్‌రెడ్డి ఎన్ని జాబ్ క్యాలెండర్లను విడుదల చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీ గల్లా జయదేవ్‌కు చెందిన అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ నేడు రాష్ట్రం నుంచి వెళ్లిపోయి తెలంగాణాతో

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఒప్పందం చేసుకుందని అన్నారు. 55 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఎవరిని ఉద్దరించారని ప్రశ్నించారు. ఏ ఒక్క కులానికీ గానీ, వ్యవస్థకు గానీ సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చారా? నిలదీశారు. పాలన గాడి తప్పిందని, దాన్ని గాడిలో పెట్టే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందని అన్నారు.

సమావేశంలో నాయకులు జీరు భీమారావు, బోయిన గోవిందరాజు, పినకాన ఆజయ్‌కుమార్, మట్ట పరుషోత్తం, హనుమంతు రామకృష్ణ, బెహరా కాళీ, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, కోళ్ల లవకుమార్, మళ్లా బాలకృష్ణ, మల్లిపెద్ది మధు, కె.కామేష్, వసంతరావు,దమయంతి, షణ్ముఖరావు, మణి, సునీల్, కిరణ్‌కుమార్; తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది గాయకుడు ఘంటసాల

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అలనాటి మేటి గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శతాబ్ది గాయకుడని, నేటికీ ఆయన పాడిన పాటలకు ప్రజాదరణ ఉందని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఘంటసాల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆ నాటి మేటి చిత్రాల్లోనే గాత్రదానం చేయడంతో పాటు వేల సంఖ్యలో పాటలు పాడారని గుర్తు చేశారు. భావితరాలకు సైతం ఆయన దిక్సూచిగా ప్రజల హృ దయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. అటువంటి మహనీయుని శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కళా ప్రవీణ బండారు చిట్టిబాబు ఆధ్వర్యాన ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలను దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఆంధ్రా లయోలా కళాశాల విశ్రాంత బోటనీ అధ్యాపకులు డాక్టర్ నిక్కు అప్పన్న సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వపు

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పాలకమండలి సభ్యులు జామి భీమశంకరరావు, విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, మిత్రకళా సమితి వ్యవస్థాపకులు పి.సుగుణాకర్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు హారికాప్రసాద్, న్యాయవాది వి.సుధారాణి తదితరులు హాజరయ్యారు.

భూముల క్రమబద్ధీకరణకు చర్యలు

- 291 మందికి 253.87 ఎకరాలు
- రూ.43.70 కోట్ల రుణాలు
- రూ.13.11 కోట్ల రాయితీ
- ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

షెడ్యూల్డ్ కులాల్లో నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు గతంలో భూమి కొనుగోలు పథకం ద్వారా అందజేసిన భూముల క్రమబద్ధీకరణకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 10 మండలాల్లో ఉన్న 291 మంది ఎస్‌సి రైతులకు లబ్ధి చేకూర్చడం జరిగిందని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కంచరాన రామారావు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు రుణాన్ని తిరిగి చెల్లించేందుకు వీలుంది. గతంలో ఎస్‌సి లబ్ధిదారులకు ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఇతర బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశాం. రుణాల వసూళ్లలో ప్రథమ స్థానంలో ఉన్నాం. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తోంది. తద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలవుతోంది. జిల్లాలో పథకాల అమలుతో పాటు వారి అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటు, కార్పొరేషన్ పరిధిలో అమలువుతున్న పథకాలు, యువతకు వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తదితర విషయాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించారు.



భూమి కొనుగోలు పథకం ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతోందా?

జిల్లాలో కొత్తగా భూమి కొనుగోలు జరగడం లేదు. కాని పూర్వం ఈ పథకం ద్వారా ఇచ్చిన భూముల స్థితిగతులు, వాటి క్రమబద్ధీకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా ప్రస్తుతం రీసర్వే జరుగుతోంది. ఈ సమయం లో లబ్ధిదారులకు సాగు హక్కు పత్రాలను జారీ చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని బూర్జ, కొత్తూరు, హిరమండలం, జి.సిగడాం, రణస్థలం, నందిగాం, మెళియాపుట్టి, మందస, టెక్కలి, లావేరు మండలాల్లో 291 మంది లబ్ధిదారులకు 253.87 ఎకరాల భూమిని ఈ పథకం ద్వారా కొనుగోలు చేసి కార్పొరేషన్ ద్వారా అందించడం జరిగింది. వీటి విలువ రూ.56.82 కోట్ల మేర ఉంటుందని అంచనా. అందులో రూ.43.70 కోట్ల మేర రుణం, రూ.13.11 కోట్ల మేర రాయితీ ఉంది. రుణాలు సక్రమంగా ఎన్ఎస్ఎఫ్‌డిసికి చెల్లించడం ద్వారా రైతులు వృద్ధి చెందడానికి వీలవుతుంది.

రాష్ట్రంలో ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ పరిధిలో ఏయే పథకాలను అమలు చేస్తోంది?

షెడ్యూల్ కులాల అభివృద్దే లక్ష్యంగా ఎస్‌సి కార్పొరేషన్ పనిచేస్తోంది. అందులో భాగంగా గతంలో వివిధ సంక్షేమ పథకాలు వేర్వేరుగా అమలు చేయడం జరిగేది. ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఇతర బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేసేవారు. కానీ ప్రస్తుతం వాటికి భిన్నంగా నేరుగా లబ్ధిచేకూర్చి వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న లక్ష్యంతో అనేక రకాలైన సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోంది. సొంత వాహనం కలిగి ఉన్న వారికి వాహన మిత్ర అందజేయడం జరిగింది. దీని ద్వారా వాహనాలు కలిగి ఉన్న ఎస్‌సి లబ్ధి దారులందరికీ ప్రయోజనం కలిగింది. గతంలో వివిద రాయితీల ద్వారా వాహనాలు కొనుగోలు చేసిన ఎస్‌సి లబ్ధిదారులకు ఏడాదికి వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు వంతున అందజేస్తున్నారు. నేరుగా ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలకు సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు జమ చేస్తున్నారు. దీని వల్ల దళారులు ప్రమేయం పూర్తిగా తగ్గింది.

యువతకు కొత్తగా వాహనాలు కొనుగోలుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?

జిల్లాలోని నిరుద్యోగులైన ఎస్‌సి (షెడ్యూల్ కులాలు) యువతకు మినీ ట్రక్కుల పంపిణీ చేసేందుకు వీలుగా అర్హతగల లబ్ధిదారులకు రాష్ట్ర షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ జిల్లాకు 69 మినీ ట్రక్కులు (నిత్యావసర వస్తువులు రవాణా నిమిత్తం) పంపిణీ చేసింది. ఈ వాహనాలకు రుణాన్ని తిరిగి వసూలయ్యేలా కార్పొరేషన్ చర్యలు తీసుకుంటోంది. అందువల్ల లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గుతోంది. వాహనాలు మంజూరు సమయంలో లబ్ధిదారుని వాటా 10శాతం, రాయితీ 60శాతం, మిగిలిన 30శాతం మొత్తాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేశాం. వాహనం యూనిట్ విలువ రూ.5,81,190కాగా 60శాతం రాయితీ రూ.3,48,714 పోనూ, లబ్ధిదారుని వాటా 10శాతం రూ.58,119, బ్యాంకు రుణం 30శాతానికి రూ.1,74,357 చెల్లించాలి. క్రమం తప్పకుండా చెల్లించే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

జిల్లాలో రికవరీ పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో వివిధ పథకాల కింద ప్రభుత్వం పలుమార్లు రుణాలు మంజూరు చేయడం జరిగింది. ఎస్ఎస్ ఎఫ్‌డిసి, ఎస్‌సి కార్పొరేషన్, ఎన్ఐఎస్ఎఫ్‌డిసి స్కీంల ద్వారా గతంలో రుణాలు మంజూరు చేయడం జరిగింది. బ్యాంకు రుణాలు కూడా ఉన్నాయి. వీటిని రికవరీ చేస్తున్నాం. రాష్ట్రంలో రికవరీలో ప్రథమ స్థానంలో ఉన్నాం.

పెళ్లి సందడి మొదలైంది

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పెళ్లంటే.. పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. ముత్తయిదువలు.. ముచ్చట్లు.

చాణ్నాళ్ల తర్వాత మళ్లీ పెళ్లి బాజాలు మోగుతున్నాయి. మార్గశిర మాస ముహూర్తాల వేళ కళ్యాణరాగం పాడేందుకు పెద్దలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి మొదలైంది. శుక్రవారం నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. కళ్యాణ మండపాలన్నీ కళకళలాడుతున్నాయి. ఊరూరా బాజాభజంత్రీలు మోగుతున్నాయి. ఈ నెలలో ఉమ్మడి జిల్లాలో వేల జంటలు ఒక్కటి కాబోతున్నాయి. సాధారణంగా కార్తిక మాసంలో వివాహాలు ఎక్కువగా జరుగుతాయి.

మార్చి 19 వరకు

ఈ నెల 2 నుంచి 18వ తేదీ వరకు, 2023 జనవరి 25 నుంచి మార్చి 19 వరకు వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయి. మూడు నెలల అనంతరం మంచి ముహూర్తాలు రావడంతో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. వివాహాలతో పాటు నిశ్చయ తాంబూలాలు, గృహ ప్రవేశాలు చేయనున్నారు. ఈ సారి మూడాలు రావడంతో నిలిచిపోయాయి. డిసెంబరులో మార్గశిర మాసం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా వివాహాలు జోరందుకున్నాయి. డిసెంబరు 2, 3, 4, 7, 8, 9, 10, 11, 14, 16, 17, 18వ తేదీలు కళ్యాణాలకు మంచి ముహూర్తాలని పండితులు చెప్తున్నారు. వీటిలో 4, 8, 14, 17, 18 తేదీల్లో ద్యివమైన లగ్గాలు ఉన్నాయి.

-పెంట నర్సింహమూర్తి, వేదపండితుడు, శ్రీకాకుళం

చేతి నిండా పని

నేను సప్లయర్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాను. రెండేళ్లుగా సంక్షోభాన్ని ఎదుర్కొన్నాం. ఆర్థికంగా నష్టపోయాం. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. వివాహ ముహూర్తాలు అధికంగా ఉండటంతో ఆర్డర్లు ఎక్కువగానే వచ్చాయి. చేతినిండా పని దొరికింది. ఒక్కో రోజు రెండు, మూడు పెళ్లిళ్ల జరుగుతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల ఉనంచి సామగ్రిని తీసుకొస్తున్నాం.

- సంతోష్, గుజరాతీపేట

జోరందుకున్న వ్యాపారాలు

- శ్రావణమాసంలో వివాహాలు జరిగాయి. బాద్రపద, ఆశ్వీయుజ కార్తిక మాసాల్లో మూడాలు రావడంతో ముహూర్తాలు లేవు. తిరిగి మార్గశిర మాసంలో పెళ్లిళ్లకు అనుకూలమైన ఘడియలు వచ్చాయి. పెళ్లి సందడి మొదలవడంతో వివిధ వ్యాపారాలు జోరందుకున్నాయి.
- వస్త్ర, బంగారం వ్యాపారాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. కళ్యాణ మండపాలు మూడు నెలల ముందుగానే బుక్ అయ్యాయి.
- ఈ నెల 18న దివ్యమైన ముహూర్తం ఉండటంతో ఆ ఒక్క రోజే వేలాది పెళ్లిళ్ల జరగనున్నాయి. దీంతో కళ్యాణ మండపాలు లభించక చాలా మంది ఆలయాల్లో వేడుకలు జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- కిరాణా, ట్రావెల్స్, బాజాభజంత్రీలు, వంట వారు, ఆర్కెస్ట్రా, శుభలేఖల ముద్రణ సంస్థలు, పూల వ్యాపారులు, పాన్ దుకాణదారులు, సప్లయర్స్, టెంట్ హౌస్‌లు, క్యాటరింగ్, ఫొటో, వీడియోగ్రాఫర్లకు గిరాకీ పెరిగింది.

ఫిబ్రవరిలోగా టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి

రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - పలాస

ఫిబ్రవరిలోగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాశీబుగ్గ కోసంగిపురం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంత పని జరిగింది, ఇంకా ఎంత పని చేయాల్సి ఉంది, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారా లేదా, పనులు చేపట్టే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా, అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు లేదా? అని తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మౌలిక సదుపాయాలతో పాటు,

టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న రాష్ట్ర చైర్మన్ ప్రసన్నకుమార్

ప్రజలకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రసన్నకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో సమస్యలను గిరిబాబు ఆయనకు వివరించారు. ఆయనతో పాటు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, టిడ్కో ఎస్ఇ డిఎన్.మూర్తి, ఇఇ సీతారాం, సిఎల్‌టిసిలు జగన్, మల్లేశ్వరరావు, మున్సిపల్ టిఎంసి భాస్కరరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులు పండించిన ప్రతి గింజాను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతూ ఆర్‌బికెలకే ధాన్యం విక్రయించాలన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కోరారు. పారదర్శకంగా ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం రైతులకు రాగి విత్తనాలను రాయితీపై అందించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ అర్జునరావు, ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ బాలరాజు, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, తహశీల్దార్ సరోజని, ఎఒ కర్ణుడు, పల్లి యోగి, పాడి అప్పారావు, జనపరెడ్డి కన్నబాబు, మాడుగుల రామారావు, జయముని, వాసు, అగ్రికల్చర్ అసిస్టెంట్ త్రివేణి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌ను సన్మానిస్తున్న సొండిలు

సొండిల సంక్షేమానికి కృషి

కవిటి: సొండిల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ హామీనిచ్చారు. మండలంలోని కొజ్జిరియాలో సొండిలు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సొండిలకు ప్రత్యేక కార్పొరేషన్, ఒబిసి సాకారని కృషి చేస్తామని అన్నారు. భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు కేటాయిస్తామని విజయ తెలిపారు. అనంతరం సొండిల సంక్షేమ భవన సముదాయంలో నిర్మించిన భవన ముఖ ద్వారం, వెంకటేశ్వర కళ్యాణ మండపం, అదనపు వంటశాలను వీరు ప్రారంభించారు. అనంతరం వారికి వేర్వేరుగా దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్, టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్, సొండిల రాష్ట్ర నాయకులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజారావు, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు సాహుకారి దివాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.సింహాచలపతి, రత్నాల రామారావు, లాభాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ఆయుష్' ఆస్పత్రి మరి లేనట్టేనా?

- ఎనిమిది నెలలుగా తెరుచుకోని వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలోని ఆయుష్ ఆస్పత్రి ఎనిమిది నెలలుగా తెచ్చుకోవడం లేదు. ఎప్పుడు వెళ్లినా మూసివేసి ఉండడంతో మండల కేంద్రంలో ఇకపై ఆయుష్ ఆస్పత్రి ఎత్తివేసినట్టేటని ప్రజలు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందజేసేందుకు గత ప్రభుత్వం అన్ని మండల కేంద్రాల్లోనూ ఆయుష్ ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. ఇక్కడికి వచ్చే రోగులకూ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. మండల కేంద్రంలోని వైద్య కేంద్రానికి లేకపోవడంతో రైతు భరోసా కేంద్రం వద్ద ఉన్న భవనంలోకి మార్చారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడును ఎనిమిది నెలల క్రిందట జిల్లాలోని పూండి పట్టణానికి బదిలీపై చేశారు. అయితే అప్పటి నుంచి ఈ ఆస్పత్రికి వైద్యుడుని నియమించకపోవడంతో ఒక్కసారి కూడా తలుపులు తెలుసుకున్న దాఖలాలు లేవు. ఆయుర్వేద వైద్యంపై అలవాటు పడిన రోగులు ఎంతోమంది ఉన్నారు.

ఆయుష్ ఆస్పత్రికి కొన్ని నెలలుగా వేసి ఉన్న తాళం

గతంలో వైద్యుడు వచ్చే సమయంలో రోజుకు 60 నుంచి వంద మంది వరకు వరకు రోగులు వచ్చేవారు. ప్రస్తుతం ఈ కేంద్రం మూతపడడంతో ఇంగ్లీష్ మందులు వాడుతూ అవస్థలు పడుతున్నారు. ఆయుర్వేద మందులు దొరక్క అనారోగ్య పాలవుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని డిఎఒ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాణి వద్ద ప్రస్తావించగా, ఆస్పత్రికి వైద్యులు లేరా? ఆస్పత్రి తీయడం లేదా? అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ... తిరిగి ప్రశ్నించారు. అయితే వైద్యుల కొరత కారణంగా ఒక్కో వైద్యునికి రెండు ఆయుష్ కేంద్రాలను అప్పజెప్పామని అన్నారు. ఈ కేంద్రానికి ప్రస్తుతం వైద్యుల కొరత ఎక్కువగా ఉండటంతో నియమించలేకపోయామని తెలిపారు. త్వరలో వైద్యుల పోస్టుల భర్తీ చేస్తామని చెప్పారు.

డాక్టరుని నియమించాలి

గతంలో ఆయుష్ ఆస్పత్రికి డాక్టర్ ఉండేవారు. దీంతో పరిసర గ్రామాల నుంచి రోజుకు 50 నుంచి 80 మంది వరకు రోగులు వచ్చి వైద్యం మంది మందులు తీసుకెళ్లారు. డాక్టర్ లేకపోవడంతో ఎనిమిది నెలలుగా ఆస్పత్రి తలుపుతు తీయడం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి వైద్యుడిని నియమించాలి. ఆయుష్ మందులు వాడితేనే ఆరోగ్యంగా ఉంటున్నాం.

- వేగు లక్ష్మం, బూర్జ

ఆస్పత్రిని తెరిపించాలి

నా వయస్సు ప్రస్తుతం 70 ఏళ్లు. నేను 20 ఏళ్లుగా ఆయుర్వేద వైద్యం పొందుతూ మందులు వాడుతున్నాను. ఇప్పటి వరకు ఇంగ్లీష్ మందులు వాడ లేదు. ఎనిమిది నెలలుగా ఆయుర్వేద వైద్యశాల మూతపడడంతో మందులు దొరకడం లేదు. దీంతో నా ఆరోగ్యం క్షీణిస్తోంది. నా శరీరానికి వేరే మందులు నప్పడం లేదు. నాలాగే అనేక మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మందుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వైద్యశాలను తెరిపించాలి.

- పాలకొండ ఎర్రయ్య, బూర్జ

రీ సర్వేతో భూ వివాదాలకు స్వస్తి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో వివాదాల్లేని భూములు లభిస్తాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జగనన్న శ్వాశత భూహక్కు పత్రాలను రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతికను ఉపయోగించుకొని రీ సర్వే ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ సర్వేతో గ్రామాల్లో భూతగాదాలకు తావుండదన్నారు. భూమికి సంబంధించి సరైన రుజువు చూపే రికార్డులు కార్యాలయంలో లేకపోవడం తగాదాలు కారణమన్నారు. సర్వే పూర్తయితే గ్రామాల్లో స్నేహభావం పెంపొందుతుందన్నారు. రైతులు కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగే రోజులు పోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.కిషోర్, ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, వైస్ ఎంపిపిలు రమేష్, మన్నెల కిషోర్, సర్పంచ్‌లు గొండెలి సుజాత, బగాది రామకృష్ణ, ,మొర్రి శంకరరావు, పి.శ్రీనివాసరావు, మహిళ విభాగం అధ్యక్షులు దివ్వెల మాధురి, వారణాసి గోవిందరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ద్వారా దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్సీ అన్నారు. సచివాలయం-2 రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో సంబంధిత రైతు ఖాతాలో ప్రభుత్వం నగదు బదిలీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ బి.కిషోర్, వ్యవసాయ అధికారి గురువెల్లి రంగారావు, ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, సర్పంచ్ గుండెలి సుజాత, వైఎస్ ఎంపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : దళారీ వ్యవస్థ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సంతబొమ్మాళి ఆర్‌బికె-1లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

సంతబొమ్మాళి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రారంభించారు. అనంతరం జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్షా పథకం కింట పట్టాలలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, మండల వైసిపి కన్వీనర్ కోత సతీష్, పిఎసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, సర్పంచ్‌లు కె.లక్ష్మి, రెయ్య రామిరెడ్డి, శ్రీరంగం వీరాస్వామి, తహశీల్దార్ జె.చలమయ్య, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఎఒ జి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

మండలంలో నూతనంగా ఎంపికైన 14 మంది గ్రామ వాలంటీర్లకు ఎంపిడిఒ కార్యాలయంలో శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు.

కాపాడిన యువకునితో సిఐ రమేష్‌కుమార్, సిబ్బంది

సముద్రంలో కొట్టుకుపోయిన యువకుడు

కాపాడిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బారువ సముద్ర తీరంలో ఆదివారం స్థానిక మెరైన్ పోలీసులు పలాస మండలం ఉదయపురానికి చెందిన చలపాకుల కుమార్ ప్రాణాలను రక్షించారు. వివరాల్లోకి వెళితే కార్తీక మాసం తర్వాత వచ్చే ప్రతి ఆదివారమూ బారువ తీరానికి పరిసర ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆదివారం ఉదయం నుంచే వేలాది సంఖ్యలో సందర్శకులు బారువ తీరానికి చేరుకున్నారు. ఉదయం పూట సమీప తోటల్లో ఆటపాటలతో కాలక్షేపం చేసిన సాయంత్రం సముద్ర స్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారువ మెరైన్ సిఐ డివిజె రమేష్‌కుమార్, సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. ఇంతలో ఓ బాలుడు కెరటాలకు కొట్టుకుపోతూ రక్షించమంటూ కేకలు వేశాడు. ఇది గమనించిన మెరైన్ సిఐ రమేష్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. హోంగార్డు హేమసుందరరావు, సిబ్బంది మాధవరావు, నారాయణమూర్తి వెళ్లి బాలుడిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం యువకుడి నుంచి వివరాలు సేకరించారు. తన స్నేహితులతో కలిసి పలాస దగ్గర ఉదయపురం నుంచి పిక్నిక్ ఇక్కడకు వచ్చానని, తనను రక్షించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సముద్ర స్నానాలు ఆచరించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సిఐ సూచించారు. అనంతరం పోలీసులు చూపిన సాహసానికి సందర్శకులు వారిని అభినందించారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ఓటురు నమోదుపై ప్రత్యేక దృష్టి

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కును నమోదు చేయాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ)తో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బిఎల్ఒలు వారి పరిధిలో అర్హత కలిగిన వారిని నూతనంగా ఓటు హక్కును నమోదు చేసేందుకు గ్రామ వలంటీర్లు ద్వారా గుర్తించాలన్నారు. వారి వద్ద నుంచి అర్హత కలిగిన ధ్రువపత్రాలను తీసుకొని ఓటు హక్కును నమోదు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఎవ్వరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమావేశంలో తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఒలు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ

సత్యమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి- నందిగాం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పేరాడ సత్యమ్మ సంస్కరణ సభ కణితివూరులో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన భైరాగి, వైసిపి నాయకులు చింతాడ గణపతిరావు, సినీ నిర్మాత బలగ ప్రకాశరావు, వజ్రపుకొత్తూరు నాయకులు పాలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏడుగురు డిఆర్‌పిలు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

మానవవనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన విశాఖపట్నంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ పర్యావరణం జీవవైవిద్యం అనే అంశంపై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారని, ఈ సదస్సుకు జిల్లా నుంచి ఏడుగురు డిఆర్‌పిలను ఎంపిక చేసి పంపిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి గారి పగడాలమ్మ ఆదివారం తెలిపారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు మానవజీవితంపై, పర్యావరణం జీవవైవిద్యంపై ప్రభావం గురించి అధ్యయనం చేయడానికి ప్రత్యామ్నాయ అనుకూల పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా నుంచి ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, (లఖిదాసుపురం), ఉత్తరకవాటం గణపతిరావు (మెళియాపుట్టి), యు.వి.ఎస్. ప్రసాదరావు (మేఘవరం), డి.జనార్ధన (వంకులూరు), వై.వాసంతి (పాతర్లపల్లి), బి.జయదేవి (లంకపేట), టి.రమణయ్య (బాతువ)లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ పనులను ఆర్‌డిఒ సీతారామ్మూర్తి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండలంలోని కొలిగాం, కేదారిపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ మేరకు బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి శ్రీహరి, రెవెన్యూ అధికారి శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత శ్రీకాకుళం జట్టు

బహుమతి అందజేసిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ట్రోఫీని అందజేస్తున్న శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడులో నిర్వహించిన జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. బొడ్డపాడులో జై భీమ్ యువజన సంఘం 29వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిని సమానంగా తీసుకోవాలన్నారు. ఇటువంటి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ బయటపడుతుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి ఈ పోటీల్లో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జైభీమ్ యువజన సంఘం అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, మాజీ అధ్యక్షుడు గుర్తం తులసీరావు, భీమారావు, టిడిపి మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, టంకాల రవిశంకర్ గుప్తా, జైభీమ్ యువజన సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

బొడ్డపాడులో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 26 టీమ్‌లు పాల్గొన్నాయి. చివరకు శ్రీకాకుళం, పాలకొండ, కిడిసింగి నిలవగా, శ్రీకాకుళం, పాలకొండ టీంలు మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఇరు జట్లు పోటాపోటీగా తలపడగా శ్రీకాకుళం విజేతగా నిలిచింది. పాలకొండ రెండో స్థానంలో నిలవగా, కిడిసింగి మూడో స్థానంలో నిలిచింది. గెలుపొందిన టీమ్‌లకు నగదు, ట్రోఫీ, సీల్డ్‌లను శిరీష ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రాత్రి 9 వ 'మిస్టర్ ఆంధ్ర' బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలు పలాసలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పోటీ పడడం ఒక విషయమైతే... గెలుపు కోసం ఎంతో కృషి చేయడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, న్యూ ఆంధ్రా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ న్యామాతుల్లా, ఉపాధ్యక్షులు ఎస్.శంషీరుద్దీన్ పాల్గొన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొత్తవలసలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరి పంట పొలంలో ఆదివారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట కోసే ముందు ఐదు మీటర్ల పొడవు ఐదు మీటర్ల వెడల్పు కొలతలు తీసుకున్నామని అన్నారు. అందులో వచ్చిన ధాన్యం దిగుబడిని లెక్క కట్టామని తెలిపారు. తద్వారా వచ్చిన దిగుబడి ఆధారంగా పంట మొత్తం దిగుబడి ఎన్ని బస్తాలు వస్తున్నాయో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

పంట కోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

రైతుల క్షేత్రాల్లో సిబ్బంది ఈ పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. పంట కోత ప్రయోగం ఎలా చేయాలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి, చేపేన సురేష్ వివరించారు. కార్యక్రమంలో తిరుపతిరావు, మల్లేశ్వరరావు, లక్ష్మి, సూరిబాబు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న శ్రీకాంత్

శ్రీకాంత్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పలు గ్రామాల్లో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆదివారం పర్యటించి పలువురి బాధిత కుటుంబాలకు పరామర్శించారు. భావనాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని, భరణికోట కాలనీకి చెందిన సవర సన్యాసిరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అలాగే కరజాడ, ముక్తాపురం, సవరశేఖరాపురం, కొండవీధి, తదితర గ్రామాల్లో పర్యటించి పలువురి వైసిపి నాయకులను కలుసుకున్నారు. పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు ట్రైకార్స్ డైరెక్టర్ ఎస్.సుభాష్, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గౌరీష్, రంగారావు, అడ్డుయాడు, బమ్మిడి కగేశ్వరరావు, కామాక్షి ప్రసాద్, బ్రహ్మ, దువ్వాడ బాలరాజు, ఎంపిటిసిలు రవికుమార్, ఉర్లాన ఋషి, బి.కిరణ్, కరుణాకర్, సింగల్‌రావ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కొండలు మాయం

- టిడిపి అధికారంలోకి వస్తే మంత్రిని విడిచిపెట్టం
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

శిరీషకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అవినీతికి మారుపేరుగా మారారని, నియోజవర్గంలో కొండల సైతం మాయం చేస్తున్నారని, మంత్రి అక్రమాలపై మావోయిస్టు లేఖలు విడుదల చేశారంటే పరిస్థితి ఎలా ఉందో నియోజకవర్గం ప్రజలు అర్థం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సంచల వ్యాఖ్యలు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడులో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం ఎల్లప్పుడూ ఒకరికే ఉండదని, టిడిపి అధికారానికి వస్తే మంత్రి సీదిరి అప్పలరాజును విడిచి పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రం దాటించే పరిస్థితి తీసుకొస్తామన్నారు. మొగిలిపాడు పాఠశాల పలాస ఉన్నత పాఠశాలలో విలీనం చేయవద్దని ఓ మహిళ ప్రశ్నిస్తే... అధికారంతో ఆమెకు ఇబ్బందులు పెట్టి ఊరు నుంచే వెళ్లిపోయే పరిస్థితి తీసుకొచ్చారని, అది నిజం కాదా అని ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడేళ్లుగా ఎక్కడ చూసినా ఇష్టానుసారంగా భూములు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కంపెనీలు రాకపోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయిందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, కౌన్సిలర్ డిక్కల ఆనంద్, టంకాల రవిశంకర్ గుప్తా, అంబటి కృష్ణమూర్తి, కొవ్వూరు సురేష్‌కుమార్, శివాజి, బి.నాగరాజు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

మండలంలోని గరుడఖండికి చెందిన టిడిపి కార్యకర్త సాసుమాన హేమసుందరరావు ఇటీవల వ్యవసాయ పనులు నిమిత్తం పొలంలో కాలుకు గాయమైంది. విషయం తెలుసుకున్న గౌతు శిరీష హేమసుందరరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఆమెతో పాటు టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బూర్లె రాజు, నిమ్మాడ బాబూరావు, రవి, ప్రసాద్, పెద్దవాడు పాల్గొన్నారు.

ఐతమ్‌కు 'స్నేహ హస్తం' ఇవ్వాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం వివిధ స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులంతా 'ఐతమ్'కు స్నేహ హస్తం అందివ్వాలని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఐతమ్ పూర్వ విద్యార్థుల 17వ వార్షిక సమావేశంలో ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలతో పాటు జూనియర్ల అభివృద్ధికి పాటుపడాలన్నారు. మారుతున్న సాంకేతికతను, కంపెనీల అవసరాలను, అనుభవాలను బిటెక్, ఎంటెక్, ఎంబిఎ, డిప్లొమో కోర్సులు చదువుతున్న ప్రస్తుత విద్యార్థులకు తెలియజేస్తూ మార్గదర్శనం చేయాలన్నారు. అలాగే ఐతమ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 'అటామినీ' భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐతమ్ కళాశాల ఇప్పటివరకు సాధించిన విజయాలతో పాటు కంపెనీలకు అవసరమైన సిలబస్‌లను ఎప్పటికప్పుడు మార్పు చేయడంతో విద్యార్థులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఐతమ్ అలూమినీ విద్యార్థులు లక్ష్మి, రమణ, విజయ్‌లు మాట్లాడుతూ జూనియర్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబొటిక్స్‌పై నూతన ఆవిష్కరణలు చేయాలని, కొత్త కొత్త కోర్సులు నేర్చుకోవాలని, ఉన్నత విద్యపై దృష్టిసారించాలని సూచించారు. ఐతమ్ అలూమినీ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సుకు కన్వీనర్ అసోసియేట్ డీన్ డాక్టర్ డి.యుగంధర్ వ్యవహరించగా, హెచ్‌డిలు డాక్టర్ బి.రామారావు, డాక్టర్ యు.డి.ప్రసన్న, డాక్టర్ వై.రమేష్, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ ఎం.వి.వి.చంద్రశేఖర్, డాక్టర్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ పి.దినకర్, డాక్టర్ ఆర్.శాంతికుమార్, డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పలువురి ఆర్థికసాయం

కొత్తూరు : మండలంలోని కుంటిభద్రకు చెందిన దుంపల వెంకటరావు ఇటీవల మృతి చెందారు. దీంతో భార్య నిర్మల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు రూ.15 నగదు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ఆదివారం అందించారు. అలాగే గూనభద్రకు చెందిన పాలక మణి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఈమెకూ రూ.15 వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అగతముడి రంజిత్ కుమార్, ట్రస్టు సభ్యులు ఎస్.హరికృష్ణ, ఎన్.జగదీష్, గాంధీ, వెంకటరావు పాల్గొన్నారు.

కొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం : మండలంలోని పాయతారీకు చెందిన మదేకేశవ బెహరా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి సమక్షంలో పవన్ సేన సమితి సభ్యులు రూ.5 వేలు ఆర్థికసాయయం ఆదివారం అందజేశారు.

అలాగే అనారోగ్యంతో ఆటోడ్రైవర్ దల్లి దివాకర్ ఇటీవల మృతి చెందారు. దీంతో భగవతిశ్రీ స్వేచ్ఛావతి ఆటో యూనియన్ సభ్యులు రూ.50 వేలు విరాళాన్ని సేకరించారు. ఆదివారం మృతుడి భార్య మహాలక్ష్మికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఇ.భాస్కర్, సెక్రటరీ నీలాద్రి, ట్రెజరర్ డి.లింగరాజు, ఉపాధ్యక్షులు శంకరరావు, తులసీరావు, ఉలాసి ఎర్రయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న అభిమానులు

సాగర తీరంలో సందడి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకుంది. పిక్నిక్‌ల సీజన్ కావడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాఖిముండి, గారాబంద పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, టెక్కలి తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సముద్ర స్నానాలు చేస్తూ వంటలు చేసుకుంటూ తీరంలో సేద తీరుతూ ఆనందంగా గడిపారు. తీరానికి వచ్చి పోయే రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొన్నారు.

సందడి చేస్తున్న పర్యాటకులు

గణితంపై పట్టు సాధించాలి

టెక్కలి : ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- టెక్కలి

భవిష్యత్ జీవితమంతా గణితంపై ఆధారపడి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు పట్టు సాధించాలని ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి పద్మనాభరావు, చిలుకు కృష్ణారావులు అన్నారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఖ్యాశాస్త్రంపై పట్టు సాధించాలన్నారు. అంతకుముందు ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల నుంచి సుమారు 60 విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు నరేష్, రోణంకి విజయ్‌కుమార్, బాపూజీ, మురళీకృష్ణ, చక్రవర్తి, తాతారావు, రుషి, శ్రీనివాస్, కాంతిలక్ష్మి పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్షకు స్పందన

ఇచ్ఛాపురం : సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన ఆదివారం జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షలను ఒరియా భాషలో నిర్వహించారు. ఈ పరీక్షలకు వివిధ పాఠశాలల్లో చదువుతున్న 9,10 తరగతులకు చెందిన విద్యార్థులు 82 మంది పాల్గొన్నారు. ఈ పరీక్షలు పర్యవేక్షణ ప్రశాంత లిమాయి, ఉమాకాంత్ మహారానా, కబీరు రెడ్డి, రుక్కు ప్రదనో, ఒ.బి.బెహరా, సంతోష బెహరా పాల్గొన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులను బెదిరించడం తగదు

ప్రజాశక్తి- పలాస

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ప్రభుత్వం మోసం చేస్తోందని, ఇళ్ల నిర్మాణాలు చేయకపోతే స్థలాలు వెనుకకు తీసుకుంటామని బెదిరించడం తగదని సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాసలో జగనన్న కాలనీని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మోసానికి జగనన్న కాలనీ వాసులు బలైపోతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల కట్టకపోతే స్థలం వెనుకకు తీసుకుంటామని ప్రభుత్వం, అధికారులు లబ్ధిదారును బెదిరించడం అన్యాయమన్నారు. ఇళ్ల కట్టుకోడానికి ఆర్థికసాయం చేస్తామన్న మాటలు నీటిమీద

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సుందర్‌లాల్

రాతలయ్యాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ 1.80 లక్షలు సరిపోవని, దీంతో నిర్మాణం చేయలేక అప్పులపాలై లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయనతో పాటు సిపిఐ నాయకులు సిహెచ్.వేణుగోపాల్, డి.ముకుంద, రవి, వెంకటరావు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానం తర్వాత ముఖవర్చస్ కోసం ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా మూడుసార్లు హాజరు వేయాలనడం సరికాదని ఎఎన్‌ఎం, హెచ్‌వి, పిహెచ్‌ఎన్, సిహెచ్‌ఒ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి ధ్వజమెత్తారు. ఈ విధానం వల్ల ప్రజలకు అందిస్తున్న సేవలకు అవరోధం కలుగుతుందన్నారు. నగరంలోని టౌన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన అసంబద్ధ, అశాస్త్రీయమైన పద్ధతిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మానవీయ కోణంలో ప్రేమ అనురాగాలతో ఇంటింటికీ ఆరోగ్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు మొబైల్ యాప్‌లు, కంప్యూటర్ యంత్రాలతో ప్రభుత్వ అమానవీయ విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కాంట్రాక్టు పద్ధతిన నియమితులై చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేసే జిఒ 143ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రజియా, కార్యదర్శిగా ఎం.రంగమ్మ ఎన్నుకున్నారు.

వికలాంగులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులను ఆదుకోవాలని వికలాంగుల జిల్లా అధ్యక్షుడు, ఎపి ఉపాధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ కోరారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం 2016 వచ్చి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ అసెంబ్లీలో అమోదం పొందలేదన్నారు. పార్లమెంట్ నుంచి పంచాయతీ సర్పంచ్ వరకూ వికలాంగులకు 5 శాతం

సభలో పాల్గొన్న వికలాంగులు

రిజర్వేషన్ కల్పించాలన్నారు. వికలాంగులందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కుటీర పరిశ్రమలకు ఆర్థికసాయం అందజేయాలన్నారు.

బిసిలకు ప్రాధాన్యం : మంత్రి

ప్రజాశక్తి- పలాస

బిసిలకు వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న బిసి జయహో మహాసభను విజయవంతం చేయాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, నియోజకవర్గం పరిశీలికులు కె.వి.సూర్యనారాయణరాజు (పులిరాజు) పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ప్రగతి భవనంలో నియోజవర్గంలోని జెడ్‌పిటిసిలతో, ఎంపిపిలతో, వైసిపి కార్యకర్తలతో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలకు సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సమావేశంలో చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపిపి డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

రణస్థలం: ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న జయహో బిసి మహాసభ పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరిం చారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయుడుబాబు, మీసాల వెంకటరమణ, లావేరు జెడ్‌పిటిసి మీసాల సీతం నాయుడు, ఎచ్చెర్ల

పలాస : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి మురళీధర్‌బాబా, బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు నక్క కృష్ణమూర్తి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నరసన్నపేట : ఈ నెల 7న విజయవాడలో నిర్వహించనున్న బిసి సభను విజయవంతం చేయాలని బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, పొట్నూరు ప్రసాద్, కణితి కృష్ణారావు కోరారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యల నాయత్వంలో నియోజకవర్గంలోని బిసిలందరూ తరలిరావాలని కోరారు.

శ్మశానానికి రహదారి లేక అవస్థలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని ఈసర్లపేట శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి లేక పంట పొలాలు, చెరువు గట్లు, తుప్పల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకు వెళ్లాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమయంలో పొలాల్లో పంటలు లేకపోవడంతో బండి దారి గుండా తీసుకెళ్తున్నామని వాపోయారు. పంటల సమయంలో పొలాల గట్ల వెంబడి చెరువు గట్టు, తుప్పల వెంబడి నానా ఇబ్బందులకు గురై తీసుకువెళ్తున్నామని తెలిపారు.

అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నేతల మాటలు కోటలు దాటుతున్నాయని, తరువాత సమస్యను గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, నాయకులు తమను గుర్తించి స్పందించి శ్మశాన వాటికకు

తుప్పల మధ్య నుంచి మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

రహదారిని నిర్మించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఆనంద్, తదితరులు

రమేష్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్‌గా డాక్టర్ మడే రమేష్ పని చేసి ఎంతో మందికి వైద్య సేవలు అందించారని, అలాగే తన సొంత డబ్బులతో ఎన్నో సేవలు కార్యక్రమాలు నిర్వహించారని డాక్టర్ తెప్పల ఆనంద్ అన్నారు. మండలంలోని నీలావతి గ్రంథాలయంలో ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన రమేష్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక గౌరవ సలహాదారులుగా పని చేశారని గుర్తు చేశారు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో యువివి గౌరవ సలహాదారులు బత్తిని ఓంకారం, ఆర్.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, గ్రంథాలయం కన్వీనర్ కుత్తుం ప్రకాశరావు, కోశాధికారి కామేష్, గౌరవ సలహాదారులు జినగ సీతారాం, ఉపాధ్యక్షురాలు గీతమ్మ, వాసుదేవరావు, తామడ రామారావు, వినోద్, తంగుడు ఖగేష్ పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ నివారణ చర్యలపై మరింతగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత పారామెడికల్ సిబ్బందిపై ఉందని విశాఖపట్నం కెజిహెచ్‌కు చెందిన కేన్సర్ నిపునుడు డాక్టర్ ఫనిశేఖర్ అన్నారు. స్థానిక సంస్కార భారతి కళాశాలలో ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పారా మెడికల్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కేన్సర్‌ను నిర్మూలించే దిశగా నిర్మూలన చర్యలపై మరింతగా అవగాహన కల్పించాలన్నారు. గర్భకోశ కేన్సర్‌పై అవగాహన మరింత

ఫణిశేఖర్‌ను సన్మానిస్తున్న పారామెడికల్ సిబ్బంది

పెంచాలన్నారు. అనంతరం ఫనిశేఖర్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భక్తుల షణ్ముఖరావు, శ్రీనివాస్ ప్రాణిగ్రాహి, మోహనరావు, త్రినాథ్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల క్రితం ఇచ్చిన ఉద్యోగోన్నతుల ఆదేశాలను కాదని, పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను సదూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు బదిలీ చేయడం సరికాదని, ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్‌మోహన్, బల్ల సురేష్‌బాబులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం బదిలీలు చేపడతామని చెప్పి బదిలీలకు ముందే సబ్జెక్టుల ఖాళీలను బట్టి ఉద్యోగోన్నతులు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దీనికి భిన్నంగా బదిలీల్లో సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలకు మారుస్తున్నారని అన్నారు. పాఠశాల సహాయకుల పోస్టులు, ఖాళీలు ఉన్న చోట ఉద్యోగోన్నతులు పొందిన వారిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు మిగులు ఉపాద్యాయుల పేరుతో సర్దుబాటు చేస్తూ తీరని అన్యాయం చేస్తున్నారన్నారు.

బహుమతులతో విద్యార్థులు

ఘనంగా భగవద్గీత జయంతి

ప్రజాశక్తి- కవిటి

స్థానిక రఘునాథ స్వామి ఆలయం వద్ద గీత జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భగవద్గీత పోటీల్లో కవిటి, శిలగాం, జగతి భారతీయ విద్యాకేంద్రం విద్యార్థులు అత్యద్భుత ప్రతిభతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. బల్లెడ యజ్ఞానందస్వామి, జానకరావు మాస్టార్ న్యాయ నిర్ణయాలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జూనియర్ విభాగంలో గంతి ఉదయశ్రీవర్మ, బి.జ్ఞానద, బి.దీక్షిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకోగా, బాల విభాగంలో బి.గాయత్రి, కె.చంద్రశేఖర్, ఎస్.రాణి రాగమయి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో కవిటి మాజీ సర్పంచ్ ఆరంగి మధు, పూడి బాలయ్య మాస్టర్, బి ఉమామహేశ్వరరావు, ఆరింగి రామకుమార్ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి... పింఛను అందించి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కవిటికొత్తూరుకు చెందిన వాలంటీర్ యర్ర జయలక్ష్మి విశాఖపట్నంలోని మెడీకవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సంగారు రంగారావుకు రూ.2.500 పింఛన్ అందించింది. రంగారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశాఖపట్నం మెడీకవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని రంగారావు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఇటువంటి పరిస్థితుల్లో రంగారావుకి పింఛను ఆవశ్యకతను గుర్తించిన జయలక్ష్మి తన సొంత ఖర్చులతో విశాఖపట్నం వెళ్లి పింఛను అందించింది. విధి నిర్వహణలో జయలక్ష్మి చూపించిన నిబద్ధతకు సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ వీరభద్రస్వామి అభినందనలు తెలిపారు.

పింఛను అందిస్తున్న జయలక్ష్మి

బహుమతిని అందజేస్తున్న శ్రీనివాసరావు

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- లావేరు

లావేరు శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కథలు చెప్పడంలో శ్యాంప్రసాద్‌కు ప్రథమ బహుమతి లభించింది. గ్రంథాలయాధికారి మురిపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అరసవల్లికి రూ.5.19లక్షల ఆదాయం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం సాధారణ రద్దీ కొనసాగింది. దీనివల్ల రూ.5.19 లక్షల మేర ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,31,400, విరాళాల రూపంలో రూ.58,287, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,30,000 ఆదాయం సమకూరినట్టు తెలిపారు.